సాక్షి
ఆదిలాబాద్
శనివారం ॥ 23 ॥ సెప్టెంబర్ ॥ 2023



నిమజ్జనానికి రూ.22 లక్షలు

జిల్లా కేంద్రంలో నిర్వహించే వినాయక నిమజ్జన ఏర్పాట్లకు గాను బల్దియా రూ.22 లక్షలు కేటాయించింది. పనులు సైతం మరూ అయ్యాయి.

9లో▸

ముందస్తు రిజర్వేషన్‌తో రాయితీ

ఆదిలాబాద్: ఆర్టీసీ బస్సులో ముందస్తుగా అప్ అండ్ డౌన్ రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 15నుంచి 29వరకు ఆన్‌లైన్ ద్వారా టికెట్ బుక్ చేసుకుంటే ఈ రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. వివరాలకు టీఎస్‌ఆర్టీసీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి డీఆర్‌వోగా రమేశ్‌రాథోడ్ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న రాథోడ్ రమేశ్

కైలాస్‌నగర్: జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి (డీఆర్‌వో)గా రమేశ్ రాథోడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనకు డీఆర్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. అయితే ఆదిలాబాద్ ఆర్డీవోగా పని చేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి ఆర్డీవోగా వెళ్లిన ఆయన ఇటీవలే జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారిగా బదిలీపై వచ్చారు. తాజాగా ఆయనకే డీఆర్వో బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నియామకం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

‘ఓపెన్’ ప్రవేశాల గడువు పెంపు

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు ఈనెల 30 వరకు పొడిగించినట్లు డీఈవో ప్రణీత, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో ప్రవేశం పొందేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాల కోసం అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అప్పు చేసి విద్యార్థులకు భోజనం వండిపెట్టాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు డీఈవో ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

యువత ఆర్థికాభివృద్ధి సాధించాలి

కైలాస్‌నగర్: స్వయం ఉపాధి పథకాలను యువత సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు అన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత, స్వయం సహాయక సంఘాల మహిళలు, పారిశ్రామిక వేత్తలకు శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతన పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని సూచించారు. ఇందులో ఎల్‌డీఎం భాస్కర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.రాజలింగం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, రిసోర్స్‌పర్సన్ శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి



కప్పర్లలో పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏవో పుల్లయ్య

తాంసి: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి, సోయా పంటల సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లావ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. మండలంలోని కప్పర్ల గ్రామ శివారులో పంట చేలను డీఏవో శుక్రవారం పరిశీలించారు. సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం క్రాప్ బుకింగ్‌లో భాగంగా ఏఈవోలు నమోదు చేసిన వివరాలు సరిగ్గా ఉన్నాయా అని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారి వెంట మార్కెట్ డైరెక్టర్ మహేందర్, రైతులు ఉన్నారు.

సంపత్తి.. ఆశలు



మావలలో కాత కాసిన పత్తి పంట



ఈ రైతు పేరు గుమ్మల మహేందర్. తాంసి మండలం వడ్డాడి గ్రామం. ఎనిమిది ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. ప్రస్తుతం మొక్కలకు కాయలు కాశాయి. ఇప్పటివరకు రూ.25వేల వరకు ఖర్చు చేశాడు. చేనంతా పచ్చగా కనిపిస్తుండడం దిగుబడిపై ఆశలు పెట్టుకున్నాడు. పంటకు మంచి ధర లభిస్తుందని ఆశిస్తున్నాడు. ఇతనొక్కడే కాదు.. జిల్లాలో చాలా మంది రైతులు ఈ సారి పత్తి పంటపై గంపెడాశతో ఉన్నారు.

- పూత, కాత దశలో పంట
- కీలకంగా మారిన వాతావరణం
- దిగుబడిపైనే రైతుల ధీమా
- ఈ సారి ధర కలిసొచ్చేనా
- నవంబర్ నుంచి కొనుగోళ్లకు ప్రణాళిక

పత్తి పంట వివరాలు..
సాగైన విస్తీర్ణం : 4,12,441 ఎకరాలు
దిగుబడి అంచనా : 28లక్షల క్వింటాళ్లు
ప్రభుత్వ మద్దతు ధర: రూ.7020 (క్వింటాలుకు)

సాక్షి,ఆదిలాబాద్: పత్తి దిగుబడిపై జిల్లా రైతులు భారీ ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం పంట పూత, కాత దశలో ఉంది. కొన్ని కాయలు కాయగా, మరిన్ని కాయాల్సి ఉన్నాయి. అయితే వాతావరణ ఒడిదొడుకులు ప్రభావం చూపుతాయా అన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. దీనికి కారణం లేకపోలేదు.. జూన్‌లో అసలు వర్షాలే లేకపోవడం, జూలైలో భారీ వర్షాలు కురువడం, ఆగస్టులో మళ్లీ వర్షాభావం, ప్రస్తుతం సెప్టెంబర్‌లో చెదురుముదురుగా కురుస్తున్నాయి. మధ్య మధ్యలో అధిక ఉష్ణోగ్రత నమోదు, ఇలా పంట కాలంలో భిన్న వాతావరణ పరిస్థితులు రైతుల ఆందోళనకు కారణమైంది. పంట చేతికొచ్చే సమయంలో మళ్లీ అకాల వర్షాలేదైనా వెంటాడుతాయా.. అనే అనుమానం వెంటాడుతోంది. ఈ వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడులపై ఏదైన ప్రభావం చూపుతుందా అన్న సందిగ్ధం తప్పితే ప్రస్తుతం పంట పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే కొన్నిచోట్ల 10 నుంచి 12 క్వింటాళ్లు, మరికొన్ని చోట్ల 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు ఎకరానికి దిగుబడి రావచ్చని రైతులు భావిస్తున్నారు.

పెరిగిన మద్దతు ధర..

వానాకాలం సీజన్ పంటలకు కేంద్రం ఇదివరకే మద్దతు ధరను ప్రకటించింది. పత్తికి గతేడాది క్వింటాలుకు రూ.6,380 ఇవ్వగా, ఈసారి రూ.640 పెంచడంతో రూ.7,020కి చేరింది. ప్రస్తుతం మార్కెట్లో రూ.7,700 వరకు ధర పలుకుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో సాధారణంగా దసరా నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తారు. అయితే ఈసారి పత్తి పంట సాగు ఆలస్యం కావడంతో కొనుగోళ్లపై ప్రభావం చూపుతుంది. నవంబర్ మొదటి వారంలో ప్రారంభించే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 12 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

26న సమీక్షా సమావేశం



పత్తి కొనుగోళ్ల విషయంలో ఈనెల 26న కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. పంట సాగు, కొనుగోళ్ల తదితర అంశాలపై అధికారులతో సమీక్షించనున్నారు. వివిధ శాఖల అధికారులు ఇందులో పాల్గొంటారు. పంట దిగుబడి చేతికొచ్చేందుకు సమయం ఉంది.

– శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఆదిలాబాద్

ఆశాజనకంగానే ఉంది..



క్షేత్రస్థాయిలో పత్తి పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరిగాయి. ఒక్కో మొక్కకు 10 నుంచి 15 కాయల వరకు కనిపిస్తున్నాయి. ఈ సారి మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఆదిలాబాద్

వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే..



ఈ సీజన్‌లో వాతావరణ పరిస్థితుల్లో ఒడిదొడుకులు పంట సాగులో రైతులకు ఇబ్బంది ఎదురైంది. అయినప్పటికీ ప్రస్తుతం పంట ఆశాజనకంగానే ఉంది. మళ్లీ అలాంటి పరిస్థితులు ఏర్పడితే కొంత దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

– శ్రీధర్ చౌహాన్, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్

ఈసారి.. వెనుకబడొద్దు!

- నేటి నుంచి స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే
- 3, 6, 9తరగతులకు అభ్యసన పరీక్షలు
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న విద్యాశాఖ
- నవంబర్ 3న ‘న్యాస్’ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: విద్యా పరంగా ఇదివరకు జాతీయస్థాయిలో వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా ప్రస్తుతం పర్వాలేదనిపిస్తోంది. ఈ ఏడాది నవంబర్‌లో జాతీయ స్థాయి అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నారు. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ నెల 23 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు 3, 6, 9 తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే పేరిట పరీక్షలను నిర్వహించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఆరు అభ్యసన పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ప్రశ్న పత్రాలను డీసీఈబీ ద్వారా ముద్రించి పాఠశాలలకు సరఫరా చేశారు. ఈ సారి రాష్ట్రంలో ఏ ఒక్క జిల్లా కూడా విద్యాపరంగా వెనుకబడి ఉండకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం విద్యార్థులకు పలుమార్లు నమూనా పరీక్షలు నిర్వహించి న్యాస్‌కు సన్నద్ధులను చేయనున్నారు.

3,6,9 తరగతులకు పరీక్ష

దేశవ్యాప్తంగా అన్నిరాష్ట్రాల్లో నవంబర్ 3న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీఈఆర్టీ ద్వారా ఈ పరీక్షను నిర్వహించనుంది. ఈ క్రమంలో జాతీయ స్థాయిలో తెలంగాణ జిల్లాలు అభ్యసన సామర్థ్యాల పరంగా వెనుకబడి ఉండకుండా పాఠశాల విద్యాశాఖ చర్యలు షురూ చేసింది. శనివారం నుంచి నవంబర్ 2వరకు ఆరు అభ్యసన పరీక్షలను 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించాలని నిర్ణయించింది. మూడో తరగతి విద్యార్థులకు ఆంగ్లం, ఈవీఎస్, గణితం, తెలుగు, అలాగే ఆరు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు సామాన్యశాస్త్రం, సాంఘీక శాస్త్రం, గణితం, తెలుగు పరీక్షలను నిర్వహించనున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్ విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహిస్తారు. అభ్యసన పరీక్షలు సెప్టెంబర్ 23, 27, అక్టోబర్ 3, 27, 31 , నవంబర్ 2న నిర్వహించనున్నారు. ప్రతీ విద్యార్థి పరీక్షలు రాసే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. అన్ని తరగతుల విద్యార్థుల సామర్థ్యాలకనుగుణంగా ప్రశ్న పత్రాలు రూపొందించారు. 40 మార్కులకు గాను వీటిని సిద్ధం చేశారు. మల్టిపుల్ చాయిస్ విధానంలో ప్రశ్నపత్రం ఉండనుంది. పరీక్ష రాసిన తర్వాత విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఫలితాలను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపనున్నారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టేట్ అచీవ్‌మెంట్ పరీక్ష నిర్వహిస్తున్నాం. ఈ నెల 23 నుంచి నవంబర్ 2 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. 3, 6,9 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పూర్తి స్థాయిలో మెరుగు పరిచేలా ప్రశ్నపత్రాలను సిద్ధం చేశాం. ఇప్పటికే పాఠశాలలన్నింటికి వాటిని పంపించాం. పరీక్షను పకడ్బందీగా నిర్వహిస్తాం.

– టి.ప్రణీత, డీఈవో

హెచ్‌ఎం పదోన్నతులకు వేళాయె

- ముగిసిన వెబ్ ఆప్షన్ ప్రక్రియ
- రేపు ప్రమోషన్ ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం



ప్రక్రియ చేపడుతున్న విద్యాశాఖ ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: ఉన్నత పాఠశాలల్లో పీజీ హెచ్‌ఎం పోస్టులు భర్తీ కానున్నాయి. ప్రక్రియలో భాగంగా గురు, శుక్రవారాల్లో పదోన్నతులు పొందే స్థానాల కోసం స్కూల్ అసిస్టెంట్లు వెబ్ ఆప్షన్ పెట్టుకున్నారు. శనివారం వారికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వనున్నారు. పదోన్నతులు పొందిన వారికి ఆదివారం ఉత్తర్వులు జారీ కానున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా కోర్టు కేసుల కారణంగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో 48 మందికి పదోన్నతులు లభించే అవకాశం ఉంది. జెడ్పీ పరిధిలో 41 పోస్టులు ఖాళీగా ఉండగా, ప్రభుత్వ యాజమాన్య పాఠశాల పరిధిలో 7 ఖాళీలున్నాయి. మల్టీ జోన్ పరిధిలో పదోన్నతులు పొందనున్నారు. ఇతర జిల్లాల నుంచి పదోన్నతిపై జిల్లాకు వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. అయితే 1:3 ప్రకారం సీనియారిటీ జాబితాను పదోన్నతుల కోసం తయారు చేసిన విషయం తెలిసిందే.

గాడిలో పడనున్న బడులు..

జిల్లాలోని పలు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండడంతో పర్యవేక్షణ అస్తవ్యస్తంగా తయారైంది. సీనియర్‌ఉపాధ్యాయులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో వారు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోయారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులుగా ఉన్నవారుకొంతమంది సబ్జెక్టులు బోధించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయ పోస్టులన్నీ ఈ పదోన్నతుల ద్వారా భర్తీ కానున్నాయి. దీంతో ఉన్నత పాఠశాలల పర్యవేక్షణ గాడిలో పడే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో 48 మందికి పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతులు లభించనున్నాయి. కాగా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లో పీజీహెచ్‌ఎం పోస్టులులేని పాఠశాలల్లో మాత్రం ప్రధానోపాధ్యాయ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ఆ పాఠశాలలో పనిచేసే సీనియర్ ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలు అప్పగించనున్నారు. జిల్లాలో ఇలాంటి పాఠశాలలు పదివరకు ఉన్నాయి.

ముగిసిన వెబ్ ఆప్షన్ ప్రక్రియ..

పదోన్నతుల కోసం సీనియర్ స్కూల్ అసిస్టెంట్లు వెబ్ ఆప్షన్లను పెట్టుకున్నారు. రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగింది. శనివారం మరోసారి ఎడిట్ చేసుకునే అవకాశం ఉంది. ఆదివారం ఉదయం వరకు పదోన్నతుల ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలుస్తోంది. ప్రమోషన్ పొందిన వారు ఆది, సోమవారాల్లోగా విధుల్లో చేరే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. కాగా బదిలీల కోసం స్పౌజ్ కేటగిరీని ఉపయోగించుకునే వారు స్పౌజ్‌కు సమీపంలోని పాఠశాలను ఎంచుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ఇతర పాఠశాలలను ఎంపిక చేసుకుంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. బదిలీల్లో స్పౌజ్ కేటగిరీ వినియోగించుకునేందుకు ఆప్షన్లు పెట్టుకున్నవారి దరఖాస్తులతో పాటు వారి వివరాలను జిల్లా విద్యా శాఖాధికారులు పరిశీలిస్తున్నారు.

ఇంటింటికీ తిరిగి.. అవగాహన కల్పించి

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: ‘డెంగీ డేంజర్ బెల్స్’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, అధికారులు, సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరుగుతూ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలతోనే వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శైలజ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మణ్, శానిటరి ఇన్‌స్పెక్టర్ నరేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కూలర్‌లోని నీటిని తొలగించాలని సూచిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, సిబ్బంది

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు



ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ శైలజ

- పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- డెంగీ ప్రభావిత కాలనీలపై శ్రద్ధ
- మున్సిపల్ కమిషనర్ శైలజ
- ‘సాక్షి ఫోన్ ఇన్’కు విశేష స్పందన

కైలాస్‌నగర్: సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ శైలజ అన్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఇటీవల డెంగీ విజృంభిస్తోంది. ప్రజలు సీజనల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ‘సాక్షి’ ఆధ్వర్యంలో ‘డెంగీ నివారణ చర్యలు, పారిశుధ్య నిర్వహణపై’ మున్సిపల్ కమిషనర్‌తో శుక్రవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణ పరిధిలోని వివిధ కాలనీల నుంచి పలువురు ఫోన్ చేసి తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని ఒపిగ్గా విని పరిష్కారానికి చొరవ చూపుతామని ఆమె పేర్కొన్నారు. ఆయా వార్డు ఇన్‌చార్జీలకు సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. సీజనల్ జ్వరాలు ప్రబలుతున్న కాలనీలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వైద్యారోగ్యశాఖ సమన్వయంతో తగు చర్యలు తీసుకుంటున్నట్లుగా తెలిపారు. దోమ లార్వాలను అంతమొందించే మలాథియాన్ స్ప్రేతో పాటు ఫాగింగ్ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఫోన్ ద్వారా పలువురు విన్నవించిన సమస్యలు, కమిషనర్ స్పందన తీరు ఇలా..

కాలర్: నందీశ్వర్‌నగర్ కాలనీలో కుక్కల స్వైర విహారంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే ఓపెన్ ప్లాట్లలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమల తీవ్రత పెరిగి రోగాలకు కారణమవుతున్నాయి.

(లక్ష్మణ్, రిటైర్డు ఎస్సై, బట్టిసావర్‌గాం)

కమిషనర్: బంగారుగూడ డంపింగ్ యార్డులో కుక్కల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశాం. వెంటనే అక్కడికి తరలించేలా చర్యలు చేపడతాం. అలాగే దోమల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

కాలర్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీ, డీఎస్పీ ఆఫీసు వెనకాల రోడ్డుపై పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. పందుల స్వైరవిహారం ఎక్కువగా ఉంది. పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.

(గంగారెడ్డి, కైలాస్‌నగర్)

కమిషనర్: పందుల సమస్య తొలగించేలా మున్సిపల్ ద్వారా చర్యలు చేపడతాం. అలాగే కాలనీకి సంబంధించి 50 మందితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి వారంలో ఒకరోజు శ్రమదానం చేస్తే పిచ్చిమొక్కలు తొలగించుకోవచ్చు.

కాలర్: పాఠశాలలో మరుగుదొడ్లను కూల్చివేసిన కాంట్రాక్టర్ ఇప్పటివరకు నిర్మాణాలు చేపట్టడం లేదు. ఒకటే మరుగుదొడ్డి ఉంది. 300 మంది విద్యార్థినులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

(భూపతిరెడ్డి, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రణదీవెనగర్)

కమిషనర్: మన ఊరు–మనబడి కార్యక్రమంపై అడిషనల్ కలెక్టర్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అక్కడి పరిస్థితులపై హెచ్‌ఎం లెటర్ ద్వారా కలెక్టర్‌కు నివేదిస్తే సమస్య పరిష్కారమవుతుంది.

కాలర్: ఇందిరమ్మ కాలనీలోని రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. నడవడానికి కూడా ఇబ్బందికరంగా ఉంది. పశువధశాల నుంచి వచ్చే వాసన భరించలేకపోతున్నాం.

(ప్రణయ్‌చారి, ఇందిరమ్మ కాలనీ)

కమిషనర్: పశువధశాల నిర్మాణ పనులను మరో 20 రోజుల్లో పూర్తి చేసి అక్కడినుంచి తరలిస్తాం. రోడ్ల గుంతలను పూడ్చివేసి రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం.

కాలర్: మా కాలనీలో పోగైన చెత్తను ఒకేచోట నిల్వ ఉంచుతున్నారు. రోజుల తరబడి తొలగించడం లేదు. దీంతో వాసన భరించలేకపోతున్నాం.అలాగే దోమలు, ఈగలు వృద్ధి చెంది ఇబ్బంది పడుతున్నాం.

(లోక ప్రవీణ్‌రెడ్డి, కైలాస్‌నగర్)

కమిషనర్: కాలనీలోని చెత్తను ఎప్పటికప్పుడు మున్సిపల్ వాహనాల ద్వారా తరలించేలా చర్యలు చేపడుతున్నాం. అలాగే రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయిస్తాం.

కాలర్: రవీంద్రనగర్ నుంచి శాంతినగర్‌కు వెళ్లే మార్గంలో డిగ్రీ కళాశాల వద్ద రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు.

(మనోజ్ పవార్, రవీంద్రనగర్)

కమిషనర్: సమస్య ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. వెంటనే సిబ్బందిని పంపించి పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతాం.

కాలర్: మా కాలనీలో డ్రెయినేజీలను రోజుల తరబడి శుభ్రం చేయడం లేదు. తీసిన చెత్తను రోడ్లపైనే కుప్పలుగా ఉంచి మర్చిపోతున్నారు.

(సురేష్, పిట్టల్‌వాడ)

కమిషనర్: పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య సమస్య లేకుండా చూస్తున్నాం. సమస్య పరిష్కారం కోసం జవాన్ వెంకట్‌ను సంప్రదించండి. ఒకవేళ పరిష్కారం కాకుంటే నా దృష్టికి తీసుకురండి.

కాలర్: ఎనిమిది రోజులుగా కాలనీలో నీటి సరఫరా నిలిచిపోయింది. తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

(ఆకాశ్, కేఆర్‌కే కాలనీ)

కమిషనర్: మిషన్ భగీరథ నీటి సరఫరాలో తలెత్తిన ఇబ్బందుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా జరగడం లేదు. దీనికి తోడు లాండ సాంగ్వి పంప్‌హౌస్‌లో సైతం మోటార్ చెడిపోయింది. మరమ్మతు పనులు చేపడుతున్నాం. త్వరలోనే నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం.

కాలర్: మా కాలనీలోని స్టేడియం వద్ద గల వాటర్ ట్యాంక్ సమీపంలో చెత్తను రోజుల తరబడి తొలగించడం లేదు. దోమలు ఎక్కువై రోగాల బారినపడే అవకాశం ఉంది.

(విజయ్, శాంతినగర్)

కమిషనర్: బల్దియా సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చూస్తున్నాం. పట్టణవాసులు తమ ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాల్లోనే చెత్త వేయాలి. ఎక్కడిబడితే అక్కడ వేయడంతోనే సమస్యలు తలెత్తుతాయి.

కాలర్: మహాలక్ష్మివాడలో మురుగు కాల్వలను శుభ్రం చేయడం లేదు. మురుగు నీరు నిల్వ ఉండి డెంగీ, విషజ్వరాలు ప్రబలుతున్నాయి. దోమల నివారణ కోసం స్ప్రే చేయాలి.

(రాజు, మహాలక్ష్మివాడ)

కమిషనర్: డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాం. జవాన్లు నిరంతరం వారి వెంట ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. మలాథియన్ స్ప్రేతో పాటు ఫాగింగ్ సైతం చేపడుతున్నాం.

కాలర్: కార్మికశాఖ కార్యాలయ సమీపంలో పందులు గుంపులుగా తిరుగుతుండడంతో పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. దీంతో రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. కౌన్సిలర్‌కు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోతుంది.

(సిద్ధార్థ, కైలాస్‌నగర్)

కమిషనర్: కాలనీలో పందులు సంచరించకుండా చర్యలు చేపడతాం. పారిశుధ్య నిర్వహణ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు మురుగు కాల్వలను శుభ్రం చేయించేలా చూస్తాం.

క్లుప్తంగా

ఖేలో ఇండియా పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్: హన్మకొండలో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. ట్రిపుల్ జంప్ పోటీల్లో వసంత, రజత పతకాన్ని సాధించగా, మూడు వేల మీటర్ల పరుగు పందెంలో మనిషా కాంస్య పతకంతో మెరిసింది. క్రీడాకారులతో శిక్షకులు రాకేష్, రాహుల్, రజిని ఉన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అడ్డి బోజారెడ్డి, రాజేష్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, పెటా అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి, స్వామి క్రీడాకారులను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులతో ప్రిన్సిపల్ అనిత

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ జలగం అనిత శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కళాశాలకు చెందిన విద్యార్థినులు వసంత ట్రిపుల్ జంప్ విభాగంలో రజత పతకాన్ని సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా డిస్క్‌త్రోలో జ్యోతి, శ్రీజ, లాంగ్ జంప్‌లో అంజలి పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు కోటయ్య, గణపతి, ప్రభాత్‌రావు, చంద్రకాంత్, నరేష్ పాల్గొన్నారు.

24న సత్యశోధక స్థాపన దినోత్సవం

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 24న సత్యశోధక స్థాపన దినోత్సవాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించుకోవాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే, జిల్లా అధ్యక్షుడు విజయ్ వాడగురే తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అఖిల భారతీయ మాలీ మహా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాత్మాజ్యోతిరావు పూలే దంపతులు 24 సెప్టెంబర్ 1873న సత్యశోధక సమాజాన్ని స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బాలాజీ గార్డెన్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనగా ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని చనాఖా గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు జిల్లా కేంద్రంలోని వినాయక విగ్రహాలను దర్శించుకునేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన మరో గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో చనాఖా గ్రామానికి చెందిన మెట్‌పల్లి సాయిచరణ్, ఉత్తర్వార్ సంకేట్‌లకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి 108లో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా పడి..

ఆటో బోల్తాపడిన సంఘటనలో పలువరికి గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. బేల మండల కేంద్రం నుంచి ఆదిలాబాద్‌కు ఆటో ప్రయాణికులతో బయలుదేరింది. తిర్పెల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బేలకు చెందిన వృద్ధుడు గంగాధర్, ఏఎన్ఎం స్వర్ణలత, పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన దస్తగిరితో పాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా మరికొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం తీవ్ర గాయాలపాలైన వారు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం రిమ్స్ పోలీసులు వన్ టౌన్ పోలీసులకు తెలియజేశారు.



గణేశ్‌నగర్‌లో..



కిసాన్‌గల్లీలో..

విభిన్నరూపాల్లో విఘ్నేశుడు..

భైంసాటౌన్: గణేశ్ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని భైంసా పట్టణంలోని ఆయా కాలనీల్లో మండలి నిర్వాహకులు ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన గణనాథుడు భక్తుల పూజలందుకుంటున్నాడు. ఆకర్షనీయమైన సెట్టింగులు వేసి, వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ఉదయం, సాయంత్రం వేళల్లో పూజలు నిర్వహిస్తున్నారు. ఓంకార్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ అన్నదానం చేస్తున్నారు.



మర్యాడిగల్లిలోని రాధాకృష్ణ భవన్ వద్ద సుభాదేవ్ యూత్ గణపతి



కిసాన్‌గల్లీలో..



మేదరిగల్లిలో..



పురాణాబజార్‌లోని మోచి సంఘం ఆధ్వర్యంలో..

పల్లె దవాఖానలకు 'ఎన్‌క్వాస్'

- వైద్య సేవలకు వరించిన పురస్కారం
- భీంపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో మూడు ఉపకేంద్రాల ఎంపిక
- మూడేళ్లపాటు ఏడాదికి రూ.1.25లక్షల చొప్పున నిధులు
- రాష్ట్రంలో ఎంపికైన ఏకైక ఉపకేంద్రాలు



అందర్‌బంద్ పల్లె దవాఖాన వద్ద ఢిల్లీ బృందం సభ్యులతో వైద్యసిబ్బంది

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. ఆరోగ్య కేంద్రం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరుసగా పురస్కారాలు సైతం ప్రకటిస్తున్నాయి. దీంతో జిల్లాలోనే మొదటగా 2017, 2021లోనూ ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్) గుర్తింపు పొందింది. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అందర్‌బంద్, అర్లి(టి), ధనోర పల్లె దవాఖానలకు (ఆరోగ్య ఉప కేంద్రాలకు) సైతం రాష్ట్రంలోనే మొదటిసారిగా ఎన్‌క్వాస్ గుర్తింపు లభించింది.

పల్లె దవాఖానాలకు ఎన్‌క్వాస్ గుర్తింపు...

జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల (ఎన్‌క్వాస్) గుర్తింపు ఇదివరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మాత్రమే పురస్కారం అందించేవారు. కానీ ప్రస్తుతం ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్య ఉపకేంద్రాలకు సైతం ఎన్‌క్వాస్ గుర్తింపు ఇస్తున్నారు. దీనిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో మొదటగా ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని మూడు పల్లె దవాఖానలు ఎన్‌క్వాస్ గుర్తింపు సాధించాయి. దీంతో ప్రతీ ఏడాది ఒక్కో పల్లెదవాఖానాకు రూ.1.25లక్షల చొప్పున మూడేళ్ల పాటు అందించనుంది.

ప్రజలకు మెరుగైన వైద్యం



గతంలో గ్రామాల్లో ప్రజలు రోగాలు, వ్యాధులు సంభవిస్తే గ్రామస్తులు ఆర్ఎంపీలు లేదా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించేవారు. ప్రస్తుతం ఆరోగ్య ఉపకేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ఉప కేంద్రంలో ఉండే వవతులతో పాటు అందించే వైద్య సేవలను ప్రజలకు తెలియజేశాం. ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగే విధంగా వైద్యం చేస్తాం.

– దివ్య, ఎంఎల్ఎస్‌పీ పల్లె దవాఖానా అర్లి(టి)

అవగాహన కల్పిస్తున్నాం



ఆరోగ్య కేంద్రంతో పాటు పల్లె దవాఖానాలో అందించే అన్ని రకాల వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పల్లె దవాఖానాలో పూర్తిస్థాయి వైద్యం అందే విధంగా వైద్యాధికారితో టెలిమెడిసిన్‌తో వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తున్నాం. ఆరోగ్య సేవలు వినియోగించుకోవాలి.

– లింగంపెల్లి జ్ఞానేశ్వర్, హెచ్ఈవో, భీంపూర్ ఆరోగ్య కేంద్రం

వైద్యం బాగుంది..



మా గ్రామంలోని పల్లె దవాఖానాలో అందించే మందులు వాడుతున్నాను. కాళ్ల నొప్పులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు బీపీ ఎక్కువగా ఉంది. దీంతో గ్రామంలోని పల్లె దవాఖానాకు వెళ్లి పరీక్షలు చేసుకుంటున్నాను. వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. గతంలో మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది.

– వాగాడే నారాయణ, అందర్‌బంద్ గ్రామం

పురస్కారం మరింత బాధ్యతను పెంచింది



మా ఆరోగ్య కేంద్రానికి ఇప్పటికే రెండు సార్లు ఎన్‌క్వాస్ పురస్కారంతో పాటు కాయకల్ప అవార్డు సైతం వచ్చింది. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పల్లె దవాఖానాలకు రాష్ట్రంలోనే మొదటగా ఎన్‌క్వాస్ గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉంది. మా ఆరోగ్య కేంద్రం సిబ్బంది కృషి జిల్లా ఉన్నతాధికారుల సహకారంతో పురస్కారం సాధించాం.

– విజయసారథి, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భీంపూర్

12 మంది బైండోవర్

మామడ: మండలంలోని దిమ్మదుర్తి, కమల్ కోట్, తోటిగూడ, జగదాంబతండా, న్యూలింగంపల్లి, అనంతపేట్, ఆదర్శనగర్, నల్దుర్తి, చందారం, తాండ్ర గ్రామాలకు చెందిన 12మందిని శుక్రవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తెలిపారు. గతంలో వీరిపై ఎక్సైజ్ కేసులు ఉండడంతో బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, ప్రకాష్, వెంకటేష్ ఉన్నారు.

జ్వరంతో బాలిక మృతి

బోథ్: మండలంలోని కౌఠ (బి) గ్రామానికి చెందిన నివేదిత(13) జ్వరంతో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నివేదిత మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. బోథ్‌లోని సీహెచ్‌సీకి తీసుకెళ్లినా నయం కాలేదు. దీంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది.

నేడు చెస్ పోటీలు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాల ఆవరణలో శనివారం ఉమ్మడి జిల్లా ఓపెన్ టూ ఆల్ చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా చెస్ చైర్మన్ కనకయ్య శుక్రవారం తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9గంటలకు పాఠశాలకు చేరుకుని పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

24న 'ఉదారి' పురస్కారం అందజేత

ఆదిలాబాద్: ప్రముఖ తత్వకవి ఉదారి నాగదాసు స్మారక సాహిత్య పురస్కారాన్ని 2023కు నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు ఏనుగు నరసింహారెడ్డికి ఈ నెల 24న ప్రదానం చేయనున్నట్లు జిల్లా కవి ఉదారి నారాయణ శుక్రవారం తెలిపారు. ఈ అవార్డు కింద రూ.5000 నగదు పురస్కారం, ప్రశంస పత్రాన్ని అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

పౌష్టికాహారం అందించడం బాధ్యత

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న పీవో

ఉట్నూర్‌రూరల్: గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం కుటుంబ సభ్యులు బాధ్యతగా తీసుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. మండలంలోని గురువారం చిన్నుగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంబాయికి పురుటినొప్పులు రావడంతో వర్షంలో ప్రసవించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.. కాగా ఈ విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో శుక్రవారం స్థానిక జిల్లా ఆస్పత్రికి చేరుకుని భీంబాయి ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం బాధ్యతగా ఉంటున్నప్పటికీ కుటుంబ సభ్యులు సైతం బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రసవ సమయంలో మహిళలను వారం రోజుల ముందుగానే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి సుఖ ప్రసవం చేయించుకోవాలని సూచించారు. వైద్యులు మహేందర్, శ్వేత, నర్సింగ్ సూపరింటెండెంట్ విమల, స్టాఫ్ నర్సు శ్రీలత ఉన్నారు.

గిరిజన క్రీడోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి

ఉట్నూర్‌రూరల్: జిల్లాలోని గిరిజన విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు గిరిజన క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ ఎం.దిలీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవనంలో ఐటీడీఏ శాఖలోని అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది నిర్వహించిన గిరిజన క్రీడోత్సవాల్లో ఉట్నూర్ ఐటీడీఏ రెండవ స్థానంలో నిలవడం అభినందనీయమని, ఈసారి ప్రథమ స్థానంలో నిలిపేలా అందరూ కృషి చేయాలని కోరారు. ఆదిలాబాద్ డివిజన్ స్థాయి పోటీలు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో, బోథ్ డివిజన్ స్థాయి పోటీలు జాతర్ల క్రీడా పాఠశాల మైదానంలో, ఉట్నూర్ డివిజన్ స్థాయి పోటీలు స్థానిక కేబీ కాంప్లెక్స్ మైదానంలో, నిర్మల్ డివిజన్ స్థాయి పోటీలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 29న నిర్వహించనున్నట్లు తెలిపారు. జోనల్‌స్థాయి పోటీలు అక్టోబర్ 3,4 తేదీల్లో ఉట్నూర్ క్రీడా పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఏసీఎంవో జగన్, ఏటీడీవోలు క్రాంతి, సౌజన్య, నిహారిక, పీడీలు రమేశ్, హేమంత్, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

ఖానాపూర్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బి.రాజు అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బన్సిలాల్ రాథోడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కరికారి రాజేశ్, జిల్లా చేరికల కమిటీ ఇన్‌చార్జి నేర రాజన్న, గిరిజన సేన రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, నాయకులు సతీశ్ ఉన్నారు.

పోలీసులపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు

ఎదులాపురం: అంగన్‌వాడీ ఆదివాసీ, దళిత మహిళలపై దాడి చేసిన ఎస్సై, సీఐ, డీఎస్పీ తదితరులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఈ నెల 20న చేపట్టిన నిరసనలో ఆదివాసీ దళిత అంగన్‌వాడీ ఉద్యోగులపై పోలీసులు దౌర్జన్యం చేయడమే కాకుండా, కులం పేరుతో దూషించి, కొట్టి గాయపర్చారని విన్నవించారు. పోలీసులే దాడి చేసి అంగన్‌వాడీ ఉద్యోగులపై కేసులు పెట్టి వేధిస్తున్నారని, పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులపై పెట్టిన కేసులు ఎత్తివేసేలా చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని వినతిపత్రం అందించారు. జేఏసీ నాయకురాలు పి.జయలక్ష్మి, ఎస్.కరుణకుమారి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఈశ్వరరావు ఉన్నారు.

బోథ్ డివిజన్ కోసం మానవహారం

- నేటితో 70 రోజులకు దీక్షలు
- ఎన్నికలలోగా డివిజన్ చేయాలని డిమాండ్
- నేడు బోథ్ బంద్



దీక్షలో కూర్చున్న నాయకులు

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా ప్రకటించాలని చేస్తున్న ఉద్యమం తీవ్రరూపం దాలుస్తోంది. డివిజన్ చేయాలని శనివారం బోథ్ బంద్‌కు బోథ్ డివిజన్ సాధన సమితి పిలుపునిచ్చింది. ఎన్నికలలోగా డివిజన్‌గా మార్చాలని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. బోథ్ పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. డివిజన్ ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. శనివారం నిర్వహించనున్న బోథ్ బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. శనివారానికి దీక్షలు 70వ రోజుకు చేరుకుంటున్నాయని సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం దీక్షలో బిజెపి నాయకులు కూర్చున్నారు. ఈ నెల 25వ తేదీన నిర్మల్ జిల్లా కేంద్రానికి వస్తున్న కేటీఆర్ బోథ్‌ను డివిజన్‌గా ప్రకటించాలని కోరారు.


కడెం ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత



గేటు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీళ్లు

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు ఉదయం 7598 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్ట్ అధికారులు ఒక వరద గేటు ఎత్తివేసి 5023 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో గేటు మూసివేశారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 697.750 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

భారీ వర్షానికి పొంగిన వాగులు



చిత్తగూడ రోడ్డుపై నుంచి పారుతున్న వరదనీరు

నార్నూర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి మండలంలోని దన్నుగూడ, బాబేఝరి, చిత్తగూడ, భారీక్‌రావుగూడ వాగుల్లోకి వరద నీరు చేరింది. చిత్తగూడ గ్రామం వద్ద రోడ్డుపై నుంచి వరదనీరు పొంగిపొర్లడంతో రోడ్డు కోతకు గురైంది. ప్రస్తుతం బాబేఝరి, మంజ్రీ, సుంగాపూర్, చోర్‌గావ్ గ్రామాలకు వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.